క్లుప్తంగా

డాక్టర్లు దైవంతో సమానం



పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): వైద్యులు దైవంతో సమానమని ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్, 34వ డివిజన్ కార్పొరేటర్ బండి నాగేంద్ర పుణ్యశీల పేర్కొన్నారు. డాక్టర్ కేఎస్ఎం డెంటల్ కేర్ ఆధ్వర్యాన గురువారం బాస్టిన్‌పాలెంలో నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. పుణ్యశీల మాట్లాడుతూ చిన్నపాటి అనారోగ్యం వచ్చినా రోగులు ప్రైవేటు ఆసుపత్రులకు వేల రూపాయలు చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పేదలకు సేవ చేయాలనే దృక్పథంతో డాక్టర్ కేఎస్ఎం డెంటల్ కేర్ సిబ్బంది 150 మంది రోగులకు ఉచితంగా దంత పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో దంత వైద్యులు కటికల సృజన, అశోక్ వర్ధన్, కె.విజయలక్ష్మి, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు వార్డు వలంటీర్ల అభ్యర్థులకు ఇంటర్వ్యూలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరపాలక సంస్థ పరిధిలో 20వ దశ వార్డు వలంటీర్ల అభ్యర్థుల ఎంపికకు శుక్రవారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు చిట్టినగర్ కలరా హాస్పటల్ సమీపంలోని సర్కిల్–1 కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. మొత్తం 136 మంది వలంటీర్ల అభ్యర్థులను ఎంపిక చేసే ఇంటర్వ్యూలకు వీఎంసీ పరిధిలోని ఆయా వార్డుల అభ్యర్థులు తమకు కేటాయించిన కేంద్రంలో మౌఖిక పరీక్షకు అన్ని సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు. ఇతర వివరాలకు స్పెషల్ ఆఫీసర్ (వార్డ్ సెక్రటేరియట్స్) లేదా వార్డ్ సెక్రటేరియట్ స్పెషల్ సెల్, నగరపాలక సంస్థ, ఫోన్ నంబర్ 81859 33187లో సంప్రదించాలని సూచించారు.

పిల్లల ఆరోగ్య వివరాలు తెలుసుకోండి

డీఎంహెచ్‌ఓ మాచర్ల సుహాసిని



లబ్బీపేట(విజయవాడతూర్పు): అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లోని చిన్నారుల ఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. ఆమె గురువారం రామవరప్పాడు సచివాలయం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలకు అందిస్తున్న పోషకాహారం, ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రల పంపిణీ, ఎత్తు, బరువుల నిర్వహణ, సామ్ మామ్ పిల్లల గుర్తింపు వంటి అంశాలను తనిఖీ చేశారు. పాఠశాలలోని పిల్లల స్థితిగతులను తెలుసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు.

నేడు 45వ డివిజన్‌లో అభివృద్ధి పనులు ప్రారంభం

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం 45వ డివిజన్ పరిధి కబేళా రోడ్డులోని కొండ ప్రాంతంలో మెట్లు, డ్రెయిన్ల నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య శుక్రవారం ఉదయం 9 గంటలకు శంకుస్థాపన చేయనున్నారు. కొండపై రామలింగేశ్వరస్వామి గుడికి సంబంధించి కొండ దిగువన ఆర్చి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం కబేళా రోడ్డులోని వార్డ్ సచివాలయంలో కొత్తగా వచ్చిన పింఛన్లను లబ్ధిదారులకు అందజేస్తారని 45వ డివిజన్ వైఎస్సార్ సీపీ బాధ్యుడు మైలవరపు కృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

పోతిన.. నోరు అదుపులో పెట్టుకో

వక్ఫ్‌బోర్డ్ జిల్లా చైర్మన్ గౌస్‌మొహిద్దీన్

వించిపేట(విజయవాడపశ్చిమ): 'పశ్చిమ' అభివృద్ధికి కృషి చేస్తున్న వెలంపల్లి శ్రీనివాసరావును విమర్శించే అర్హత జనసేన నాయకుడు పోతిన మహేష్‌కు లేదని, ఆయన నోరు అదుపులో పెట్టుకోవాలని జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ గౌస్‌మొహిద్దీన్ పేర్కొన్నారు. వించిపేట నైజాంగేటుసెంటర్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ఒక్క ఎమ్మెల్యే లేరని, కనీసం నగరంలో ఒక్క కార్పొరేటర్‌ను కూడా గెలిపించుకోలేని 'జనసేన' పగటి కలలు మానాలని హితవు పలికారు. అభివృద్ధికి మారుపేరుగా నిలిచిన వెలంపల్లిని విమర్శిస్తే బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

నేత్రదానం సామాజిక కర్తవ్యం

కంకిపాడు: నేత్రదానం సామాజిక కర్తవ్యమని ఉప్పలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుందర్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఉప్పలూరు గ్రామంలో జాతీయ నేత్రదాన వారోత్సవాల్లో భాగంగా అవగాహన ర్యాలీ గురువారం నిర్వహించారు.

ఘనంగా సహస్ర కలశాభిషేకం



పీఠంలో లలితాంబికాదేవి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శ్రీలలితాంబికా పీఠంలో గురువారం సహస్ర కలశాభిషేక మహోత్సవం ఘనంగా జరిగింది. శ్రావణ పౌర్ణమి, ఆలయ నిర్మాణం జరిగి 25 ఏళ్లు పూర్తి కావడంతో గురువారం విశేష పూజలు చేశారు. తొలుత దుర్గాఘాట్‌లోని వీఐపీ ఘాట్ నుంచి భక్తులు కలశాలతో నదీ జలాలను తీసుకుని పీఠానికి ఊరేగింపుగా వచ్చారు. దుర్గాఘాట్‌లో జరిగిన పూజల్లో మేయర్ రాయన భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుతో బ్రాహ్మణ వీధి, కొత్తపేట, కేటీరోడ్డు మీదుగా పాలప్రాజెక్టు క్వార్టర్స్ సమీపంలోని పీఠానికి చేరింది. అక్కడ లలితాంబకు పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. పీఠాధీశ్వరి శివలీల మాతాశ్రీ పర్యవేక్షణలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, నరేంద్ర దంపతులు అభిషేకాలు నిర్వహించారు. పూజల్లో పలువురు కార్పొరేటర్లు, భక్తులు, ఉభయదాతలు పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమార్చన జరిగింది. ప్రతి నెలా పౌర్ణమి రోజున లలితాంబికకు విశేష అభిషేకాలు, పూజలు చేస్తున్నట్లు పీఠం కన్వీనర్ రాంపిళ్ల చైతన్య పేర్కొన్నారు.



దుర్గాఘాట్‌లో నదీ జలాలకు పూజలు చేస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి

కమనీయం శ్రీవారి కల్యాణ వైభోగం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కలియుగదైవం శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం గురువారం రమణీయంగా జరిగింది. వన్‌టౌన్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో పవిత్రోత్సవాలు పురస్కరించుకొని శ్రీవారి కల్యాణాన్ని ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రావణమాసం, స్వామి వారి జన్మనక్షత్రం 'శ్రవణ'తోపాటు ఆయన వివాహ తిథి కూడా అదే కావడంతో ఏటా పవిత్రోత్సవాల వేళ స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. నమో వేంకటేశయ అనే నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. మంగళవాయిద్యాలు, హరినామస్మరణ, వేదపఠనం, అన్నమయ్య కీర్తనాలాపనలు, వీనులవిందైన వ్యాఖ్యానం, మంత్రోచ్చరణల మధ్య స్వామి వారి కల్యాణోత్సవం భక్తులకు కనువిందు చేసింది. తొలుత స్వామివారి ఉత్సవమూర్తులను మేళతాళాలతో కల్యాణవేదికపైకి తీసుకొచ్చారు. స్వామివారికి మధుపర్కాలను సమర్పించి వివాహానికి సిద్ధం చేశారు. అనంతరం పుణ్యహవాచనం, కన్యాదానం, మంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి ఒక్కొక్క ఘటాన్ని వివరిస్తూ ఉత్సవాన్ని జరిపించారు. ఆయన మాట్లాడుతూ శ్రీవారికి నిర్వహించే నిత్యకల్యాణం, మాసకల్యాణం వంటి ఉత్సవాలు కేవలం తంతు కాదన్నారు. సకల సృష్టికి శుభాలు చేకూరాలని స్వామివారికి నిర్వహించే మంగళప్రదమైన కార్యక్రమాలన్నారు. ఉదయం తిరుమంజనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని మూలవిరాట్‌ను అత్యంత సుందరంగా అలంకరించారు. కల్యాణోత్సవం అనంతరం ప్రసాద వితరణ జరిగింది. కల్యాణోత్సవాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి ఘంటసాల శ్రీనివాస్ పర్యవేక్షించారు. పలువురు ప్రముఖులు స్వామివారికి పూజలు చేశారు.



ఉభయ దేవేరులతో శ్రీవారు

వైఎస్సార్ ఆశయ సాధనకు సీఎం జగన్ కృషి

- ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ గౌతమ్‌రెడ్డి
- 3న వైఎస్ విగ్రహావిష్కరణ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వైస్ రాజశేఖరరెడ్డి ఆశయ సాధనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని ఏపీ ఫైబర్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ పూనూరు గౌతమ్‌రెడ్డి అన్నారు. సత్యనారాయణపురంలోని వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యాలయంలో గురువారం మీడియా సమావేశం జరిగింది. గౌతమ్ రెడ్డి మాట్లాడుతూ తెలుగు ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన గొప్ప వ్యక్తి రాజశేఖర్‌రెడ్డి అని, ఆ మహనీయుడు మరణించి 14 సంవత్సరాలు గడిచిందంటే నమ్మలేకపోతున్నామన్నారు. ఆయన పేదలకు ఇల్లుతో పాటు విద్య, వైద్యం, తాగునీరు, సాగునీటికి పెద్దపీట వేశారని గుర్తు చేశారు. తెలుగు ప్రజలకు సంక్షేమ పాలన అందించిన వైఎస్సార్ బాటలోనే ఆయన తనయుడు మన ముఖ్యమంత్రి వైస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గౌతమ్‌రెడ్డి

వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో బీఆర్టీఎస్ రోడ్డులోని ఫుడ్ జంక్షన్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమం సెప్టెంబర్ 3న నిర్వహిస్తున్నామని తెలిపారు. వైఎస్సార్ అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ట్రేడ్ యూనియన్ నాయకులు చిమటా బుజ్జి, మాజీ కార్పొరేటర్ యాదల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడిగా పాశం

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీలను కలుపుకుని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు పాశం వెంకటేశ్వర్లు అన్నారు. విజయవాడ గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడుగా ఆయన ప్రమాణ స్వీకారం చేసి పదవీ బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర నాయకుడు జగదీష్ యాదవ్, బీసీ సంక్షేమ సంఘం యువజన అధ్యక్షుడు కుమ్మరి క్రాంతికుమార్, దళిత బహుజన ఫ్రంట్ నాయకుడు సుబ్బారావు, న్యాయవాది భాస్కరరావు, మైనారిటీ మహిళా నాయకురాలు షేక్ ఫరాదా తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యనగర్‌లో షాపుల్లో చోరీలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అయోధ్యనగర్‌లో బుధవారం అర్ధరాత్రి మూడు దుకాణాల్లో వరుస చోరీలు జరిగాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అయోధ్యనగర్ శ్రీనివాస్ హైట్స్ ప్రాంతంలో సాయి ప్రసన్న మెడికల్, ఫ్యాన్సీ షాపు, సీతారావమ్మ కిరాణాకొట్టు, ఎలక్ట్రికల్ షాపులు ఉన్నాయి. బుధవారం రాత్రి 10 గంటల సమయంలో తమ షాపులకు తాళాలు వేసి ఇళ్లకు వెళ్లారు. గురువారం ఉదయం వచ్చి చూసే సరికి షాపుల తాళాలు పగలకొట్టి కనిపించాయి. అనుమానం వచ్చిన వారు లోపలకు వెళ్లి చూడగా వస్తువులు, నగదు మాయం కావడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటనలో మొత్తం రూ.25 వేల నగదు, 10 తులాల వెండి పట్టాలు, సెల్‌ఫోను అపహరణకు గురయ్యాయి. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

క్వాంటమ్ మెకానిక్స్‌పై పట్టు సాధించాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు క్వాంటమ్ మెకానిక్స్‌పై పట్టు సాధించినప్పుడు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ (ముంబయి) సైంటిఫిక్ ఆఫీసర్ డాక్టర్ తిరుమలరావు బిట్రా అన్నారు. కేబీఎస్ కళాశాల ఫిజిక్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగాల ఆధ్వర్యంలో 'బర్త్ ఆఫ్ క్వాంటమ్ మెకానిక్స్' అంశంపై సదస్సును గురువారం నిర్వహించారు. డాక్టర్ తిరుమలరావు బిట్రా మాట్లాడుతూ భౌతికశాస్త్రంలో అనేక ఆవిష్కరణలు రోజురోజుకు ముందుకు వస్తున్నాయని వివరించారు. ఇవి మానవ వికాసానికి అండగా ఉంటున్నాయన్నారు. క్లాసికల్ ఫిజిక్స్ పరిష్కరించలేని అనేక సమస్యలను క్వాంటమ్ మెకానిక్స్ పరిష్కరిస్తుందని చెప్పారు. 20వ శతాబ్ద ప్రారంభంలో దీన్ని అభివృద్ధి చేశారన్నారు. స్థూల వస్తువులకు క్లాసికల్ ఫిజిక్స్ పరిష్కారం చూపితే పరమాణు స్థాయిలో సమస్యల పరిష్కారానికి క్వాంటమ్ మెకానిక్స్ చాలా కీలకమైన పాత్ర పోషిస్తుందని తెలిపారు. దీనిపై పట్టు సాధించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ వస్తున్న మార్పులను విద్యార్థులు గమనించాలన్నారు. కార్యక్రమంలో సైంటిఫిక్ ఆఫీసర్ శ్వేతావర్మ, సీహెచ్ నాగభూషణం, ఆర్. ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌కు మరింత శోభ

కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటి కలెక్టరేట్‌కు మరింత శోభను తీసుకువస్తామని జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు చెప్పారు. పచ్చదనం పెంపొందించడం ద్వారా ఆహ్లాదకర వాతావరణం కల్పించి మోడల్ కలెక్టరేట్‌గా తీర్చి దిద్దడానికి చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టరేట్ ప్రాంగణాన్ని గురువారం జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్‌తో కలిసి కలెక్టర్ ఢిల్లీరావు పరిశీలించారు. కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ జిల్లాల పునర్వ్యవస్థీకరణ తర్వాత ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ఆవరణను ఇప్పటికే కొంత మేర పచ్చదనంతో తీర్చిదిద్దటం అభినందనీయమన్నారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్, జిల్లా రెవిన్యూ అధికారి కార్యాలయాలు ఒకే ప్రాంగణంలో పాలన సాగించడంతో అనేక మంది ప్రజలు కార్యాలయానికి వస్తుంటారన్నారు. దీని దృష్ట్యా కలెక్టరేట్ ప్రాంగణంలో నేరేడు, మామిడి, ఉసిరి వంటి ఫలసాయ వృక్షాలతో పాటు టేకు, గానుగ, రావి, బాదం వంటి నీడనిచ్చే చెట్లను పెంచాల్సిన అవసరం ఉందని వివరించారు. మొక్కలు నాటడానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యాలయ ప్రాంగణంలో దివ్యాంగులకు, మహిళలకు ప్రత్యేకంగా మరుగుదొడ్ల నిర్మించాలన్నారు. ఎలక్షన్ గోడౌన్‌కు అవసరమైన మరమ్మతులను పూర్తిచేసి ఉపయోగానికి సిద్ధంగా ఉంచాలన్నారు. పింగళి వెంకయ్య సమావేశ మందిరం వద్ద సందర్శకుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మినరల్ కూలింగ్ వాటర్‌ప్లాంట్‌ను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. వ్యర్థ నీరు ఇంకుడు గుంతను ఏర్పాటుచేస్తే భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. మొక్కలు, వృక్షాల పేర్లను ప్రదర్శించేలా బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలోనే మోడల్ కలెక్టరేట్ గా తీర్చిదిద్దడానికి సమష్టిగా కృషి చేద్దామని కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. ఆ ప్రాంగణాన్ని కలెక్టరేట్ పరిపాలన అధికారి ఇంతియాజ్ బాషా, కో ఆర్డినేషన్ విభాగం సూపరిండెంటెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్, భూసేకరణ విభాగం సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, జేసీ సంపత్‌కుమార్, డీఆర్వో మోహన్‌కుమార్

పర్యావరణ పరిరక్షణకు వీజీఆర్ కృషి



కలెక్టర్ ఢిల్లీరావు, డాక్టర్ సమరానికి మొక్కలను అందజేస్తున్న డాక్టర్ వేణుగోపాలరెడ్డి

- కలెక్టర్ ఢిల్లీరావు
- ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి వీజీఆర్ హాస్పటల్ వెయ్యి మొక్కలు అందజేత

లబ్బీపేట(విజయవాడతూర్పు): పర్యావరణ పరిరక్షణకు మధుమేహ వైద్యుడు కొండా వేణుగోపాలరెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. మొగల్రాజపురంలోని వీజీఆర్ చారిటబుల్ ట్రస్టు, వీజీఆర్ డయాబెటీస్ హాస్పటల్ ఆధ్వర్యాన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా శాఖకు గురువారం వెయ్యి మొక్కలను కలెక్టర్ ఢిల్లీరావు చేతుల మీదగా, రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ సమరానికి అందచేశారు. అక్కడ జరిగిన సభలో కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ మొక్కల పెంపుతో కాలుష్య నివారణ చేయొచ్చన్నారు. ప్రజలకు ఉపయోగపడే ఔషధ, ఫలసాయం అందించే మొక్కలను పెంచాలన్నారు. వర్షాధారంతో పెరిగే వేప, రావి, గానుగ, జామ, నిమ్మ, మామిడి వంటి మొక్కలను నాటాలని సూచించారు. డయాబెటిస్ నివారణకు ప్రతి ఒక్కరూ ఆహార అలవాట్లతో పాటు, వ్యాయామం చేయాలని చెప్పారు. వ్యాధి నివారణకు కాలుష్య నివారణ అవసరమని గుర్తించి వేలాది మొక్కలను పంపిణీ చేస్తూ సామాజిక సేవలో భాగస్వాములైన వీజీఆర్ డయాబెటిస్ సెంటర్ అధినేత డాక్టర్ కె. వేణుగోపాలరెడ్డిని అభినందించారు.

అనంతరం డాక్టర్ వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ ఇప్పటి వరకూ 40 వేల మొక్కలను పంపిణీ చేశామని పేర్కొన్నారు. కొన్ని ప్రాంతాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ జి.సమరం, కార్యదర్శి ఇళ్ల రవి, డాక్టర్ కె. తనూజ, రెడ్‌క్రాస్ ప్రతినిధులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంటర్వ్యూకు వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కేఎల్‌రావు నగర్ రాకేష్ పబ్లిక్ స్కూల్ ప్రాంతంలో తల్లిదండ్రులతో షేక్ రజియా సుల్తానా నివసిస్తోంది. ఆమె గతంలో ఓ కార్పొరేట్ స్కూల్‌లో హిందీ టీచర్‌గా పని చేసేది. కొంత కాలంగా ఇంటి వద్దే ఉంటున్న రజియా సుల్తానా గురువారం ఉదయం పంజా సెంటర్‌లోని ఓ స్కూల్‌లో ఇంటర్వ్యూ ఉందని చెప్పి వెళ్లింది. సాయంత్రమైనా తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఓటర్ల జాబితాలో తొలగించిన, కొత్తగా నమోదు చేసిన ఓటర్లతోపాటు మార్పు చేర్పులను నిశితంగా పరిశీలించి పారదర్శకంగా ఓటర్ల జాబితాను రూపొందిస్తున్నామని కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు తెలిపారు. గురువారం సెంట్రల్, పశ్చిమ నియోజకవర్గాల పరిధిలోని మాచవరం, భవానీపురంలో ఓటర్ల జాబితాను కలెక్టర్ ఢిల్లీరావు పరిశీలించారు. కుమ్మరిపాలెంలోని జొన్నవిత్తుల వారి వీధి, భవానీపురంలోని మాదాల వారి వీధిలో నివసిస్తున్నోటర్ల ఇళ్ల వద్దకు వెళ్లి జాబితాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏడు నియోజకవర్గాల పరిధిలో ప్రస్తుతం ఉన్న ఓటర్ల జాబితా ప్రకారం 16.670 లక్షల మంది ఓటర్లు నమోదయ్యారన్నారు. నమోదైన ఓటర్ల జాబితాను బీఎల్వోలు పరిశీలించారన్నారు. నియోజకవర్గ పరిధిలోని ఆర్వోలు కనీసం 1000, స్పెషల్ ఆఫీసర్ 500, కలెక్టర్ హోదాలో జిల్లా ఎన్నికల అధికారి కనీసం 100 ఓట్లను క్షేత్రస్థాయిలో పర్యటించి ర్యాండమ్ చెక్ చేయాలన్నారు. సెప్టెంబర్ 7వ తేదీలోపు ఈ ప్రక్రియను పూర్తి చేసి 8వ తేదీన ఎన్నికల సంఘానికి నివేదికను సమర్పిస్తామన్నారు. కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఉదయభాస్కర్‌రావు, సహాయ రిటర్నింగ్ అధికారి డి. వెంకటలక్ష్మి, ఎన్నికల డెప్యూటీ తహసీల్దార్ అబ్దుల్ దరియా, సీనియర్ అసిస్టెంట్ రాజేంద్రప్రసాద్, బీఎల్వోలు వనిత, రాజశేఖర్‌బాబు, సెంట్రల్ నియోజకవర్గ ఎన్నికల డెప్యూటీ తహసీల్దార్ సురేష్ పాల్గొన్నారు.



ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

ప్రజాభాగస్వామ్యంతో పర్యావరణ పరిరక్షణ

మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): పర్యావరణ పరిరక్షణ చర్యల్లో ప్రజలు భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆకాంక్షించారు. కాలువలను పరిశుభ్రంగా ఉంచుకుందాం.. మన ఆరోగ్యాన్ని మనమే కాపాడుకుందాం అనే నినాదంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీలక్ష్మి సూచనలతో మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆధ్వర్యంలో మిషన్ కృష్ణా – గోదావరి కాలువల (ఎంసీకేజీసీ) ప్రక్షాళనలో భాగంగా నగరంలోని మూడు కాలువల (బందరు, ఏలూరు, రైవస్)ను శుభ్రం చేసే కార్యక్రమాలను వీఎంసీ చేపట్టిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా గురువారం వీఎంసీ ప్రధాన కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. నగరంలోని మూడు కాలువలు కీలకమైన జలమార్గాలుగా పని చేస్తాయని, నీటి పారుదల, నీటి సరఫరాతోపాటు మొత్తం పర్యావరణ వ్యవస్థ సమతౌల్యంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయిన కారణంగా ఏర్పడిన కాలుష్యంతో పర్యావరణానికి, ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లుతుందని తెలిపారు. కాలువల్లో వ్యర్థాలు వేయకుండా నిరోధించి పర్యావరణాన్ని కాపాడటంలో ప్రజలు సహకరించాలని కోరారు. కెనాల్ బండ్ సుందరీకరణకు కాలువల పక్కన చెత్త, వ్యర్థాలను వేయకుండా జల కాలుష్యాన్ని తగ్గించాలని సూచించారు.

అడుగులు కదిలాయి.. పదములు మురిశాయి..

ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం(అకాడమీ సాంస్కృతిక సంస్థ) నెల వారీ కార్యక్రమంలో మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ కళావేదికపై గురువారం నిర్వహించిన జానపద గీతాల కార్యక్రమం ఆకట్టుకుంది. విజయనగరం జిల్లాకు చెందిన గాయకుడు జానకీరావు బృందం రెండుగంటలపాటు జానపద గీతాలను ఆలపించారు. పాడుదుమా స్వేచ్ఛాగీతం, మామకూతురా నీతోమాటున్నాది, నాక్కిలేసు గొలుసు, ఎల్లిపోతావురా మనిషి తదితర గీతాలను సహచర గాయకులు తిరుపతిరావు, శివకుమార్, శివదుర్గాప్రసాద్, గణేష్ ఆలపించారు. జానపద గీత రచయితశ్రీనివాస్ సహకరించారు. ఈశ్వరరావు, కోకిల, పూజిత, రమేష్, తారక్ వంశీ, మోహన్ నృత్యాలను, డప్పువాయిద్యాలతో అనుకరించారు. కార్యక్రమంలో కళాపీఠం అధ్యక్షుడు పాలడుగు లక్షణరావు, కళాపీఠం నిర్వాహక సంఘ సభ్యులు రమేష్, కళాపీఠం ఉపాధ్యక్షుడు వెల్లంకి నాగభూషణం, ప్రధానకార్యదర్శి లలిత్ ప్రసాద్, కార్యదర్శి జీవీఎస్ ప్రకాష్ పాల్గొన్నారు.

–విజయవాడ కల్చరల్







విద్యార్థులు ట్యాబ్‌లను వినియోగించుకోవాలి

పాయకాపురం(విజయవాడరూరల్): బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను విద్యార్థులు సక్రమంగా వినియోగించుకోవాలని ఎన్టీఆర్ జిల్లా బైజూస్ నోడల్‌అధికారి షేక్ సైదాబి అన్నారు. కండ్రికలో బీవీ సుబ్బారెడ్డి మున్సిపల్ హైస్కూల్‌లో గురువారం ట్యాబ్‌లను వినియోగించడంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యావ్యవస్థలో వస్తున్న మార్పులకనుగుణంగా ట్యాబ్‌లను వినియోగించడంలో సాంకేతికంగా విద్యార్థులు అవగాహన కల్గి ఉండాలన్నారు. ట్యాబ్‌లు సమర్థంగా పని చేయడానికి నవీకరణ చేశామని తెలిపారు. సాంకేతిక లోపాలు వస్తే ప్రధానోపాధ్యాయుల ద్వారా జిల్లా విద్యాశాఖ కార్యాలయం, సచివాలయ సిబ్బందిని సంప్రదించాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కేవీ దుర్గారావు పాల్గొన్నారు.